

సిరిసిల్ల పట్టణం

బల్దియాలపై బకాయిల భారం

- సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలకు రూ.19.79 కోట్ల ప్రభుత్వ బకాయిలు
- ప్రజల ఆస్తి పన్ను బకాయిలు రూ.5.77 కోట్లు
- 2025-26 ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

బల్దియాలకు ఆస్తి పన్నుల ఆదాయమే ప్రధానంగా భావిస్తారు. మున్సిపల్ నిర్వహణ, పట్టణాల అభివృద్ధికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందుకోసం ప్రతి ఆర్థిక సంవత్సరం చివరి మాసాల్లో కమిషనర్ నుంచి మొదలుకొని బిల్‌కలెక్టర్ల వరకు పన్నుల వసూళ్ల ప్రధాన పనిగా భావిస్తారు. ప్రజల నుంచి పన్నుల వసూళ్ల పూర్తిచేసి రాష్ట్రస్థాయిలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. అయితే రెండు మున్సిపాలిటీలకు సర్కార్ నుంచి రావాల్సిన ఆస్తి పన్నుల బకాయిలు భారంగా మారుతున్నాయి. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలు మాత్రమే ఉన్నాయి. ప్రతి ఆర్థిక సంవత్సరంలో గృహ, కమర్షియల్ ఆస్తిపన్నుల వసూళ్లలో ముందు వరుసలో నిలుస్తున్న ప్రభుత్వ బకాయిలు గుదిబండగా మారుతున్నాయి. రెండు మున్సిపాలిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన కార్యాలయాల నుంచి రావలసిన బకాయిలు ఎప్పుడు వస్తాయో స్పష్టత కూడా ఉండడం లేదు.

గతేడాది రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం..

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు గృహాలు, కమర్షియల్ భవనాలకు సంబంధించి ఆస్తి పన్నుల వసూళ్లలో రాష్ట్రస్థాయిలో ముందు వరుసలో నిలుస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు రూ 9.60 కోట్లు పన్నులు వసూలు చేసి రికార్డ్ సాధించాయి. సిరిసిల్ల మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలోనే ప్రథమంగా నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ పన్నులు మినహా సిరిసిల్ల మున్సిపాలిటీలో 23487 ఇళ్లకు రూ 6.36 కోట్లు లక్ష్యానికి రూ 6.13కోట్లతో 96.99 శాతంతో ముందంజలో నిలిచారు. వేములవాడ మున్సిపాలిటీలో రూ 4.07 కోట్ల లక్ష్యానికి

మిగతా 8వ పేజీలో

సగానికి పైగా వడ్డీ భారమే..

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీల పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి 275 భవనాలు ఉన్నాయి. వీటి ద్వారా రూ 19.79 కోట్లు ఆస్తి పన్నుల బకాయిలు రావాల్సి ఉంది. ఆస్తి పన్నుల బకాయిలు సగానికి పైగా వడ్డీ భారమే ఉంది. సిరిసిల్ల మున్సిపాలిటీకి రావాల్సిన డిమాండ్‌లో 63 భవనాల నుంచి రూ 3.47 కోట్లు వసూళు లక్ష్యంగా ఉంది. బకాయిల్లో వడ్డీ రూ.2.01 కోట్లు ఉంది. ఇందులో ప్రతి సంవత్సరం రూ 24.05 లక్షలు పన్నులు రావాల్సి ఉంది. ఇందులో మూడు కేంద్ర ప్రభుత్వ భవనాలకు రూ 1.29 లక్షలు పాత బకాయిలు కలుపుకొని రూ 25.79 లక్షలు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 63 భవనాల నుంచి రూ 22.76లక్షలు ఉండగా పాత బకాయిలు కలుపుకొని రూ 3.21కోట్లు వసూళ్ల లక్ష్యం ఉంది. ఇందులో రూ 9.53 లక్షలు వసూలు కాగా ప్రభుత్వం నుంచి రూ 3.37కోట్లు వసూలు కావలసి ఉంది. ఇందులో వడ్డీ రూ 2కోట్లు ఉన్నాయి. వేములవాడ మున్సిపాలిటీలో 212 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భవనాలు ఉన్నాయి. వీటి ద్వారా రూ 16.68 కోట్ల బకాయిల వసూలు లక్ష్యం ఉంది. బకాయిలపై వడ్డీ రూ8.42 ఉంది. ఇందులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి రెండు భవనాలు ఉండగా రూ 1.29 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 210 భవనాల నుంచి రూ 16.67 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇందులో ఇప్పటివరకు రూ 26.27 లక్షలు వసూలు కాగా, బకాయిలు రూ 16.42 కోట్లు రావాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు అసలు కంటే వడ్డీని రెట్టింపు అవుతోంది. మున్సిపాలిటీలో నుంచి నోటీసులు వెళ్లిన అధికారులు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదని సమాధానం వస్తోంది.



వేములవాడ మున్సిపల్ కార్యాలయం

అర్హులందరికీ రుణాలు అందించాలి

- బ్యాంకర్ల సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని బ్యాంకులు, ప్రభుత్వ లక్ష్యం మేరకు అర్హులైన వారందరికి రుణాలు ఇవ్వాలని జిల్లాస్థాయి బ్యాంకర్స్ కమిటీ చైర్‌పర్సన్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాస్థాయి బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ముందుగా వ్యవసాయం, గృహ, విద్యరుణాలు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వ పథకాల అమలుపై బ్యాంకుల వారిగా ఇన్‌చార్జి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బ్యాంకులు తమకు కేటాయించిన లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. వ్యవసాయ, విద్య రుణాలు ప్రస్తుతం 50 శాతం పూర్తి చేయాలని, ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వంద శాతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఇందరిమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. బ్యాంక్‌లలో ఖాతాదారులకు తెలపాలని, కేవైసీ అప్‌డెట్ చేయించాలని సూచించారు. వచ్చేనెల 31వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. బ్యాంక్‌లలో అందించే సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని, ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక మోసాలపై వినియోగాదారులకు అవగాహన కల్పించారు. 1930/1945 టోల్‌ఫ్రీ నంబర్‌పై వివరించాలని, పీఎంఈజీపీ, పీఎం ఎఫ్ఎంఈ, స్వానిధి అమలు పురోగతిలను అడిగి తెలుకున్నారు. నాబార్డ్ అందించే వివిధ రుణాలపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్‌డీవో శేషాద్రి, ఎల్‌డీఎం మల్లికార్జున్‌రావు, ఆర్బీఐ ఏజీఎం రాములుసహావత్, నాబార్డు డీడీఎం దిలీప్, యూబీఐ డీజీఎం అపర్ణరెడ్డి, ఎస్‌బీఐ ఏజీఎం వెంకటేష్, బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ

ఇల్లంతకుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు కొనసాగిన శిక్షణ బుధవారం ముగిసినట్లు మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుక్‌ఆన్ డిజిటల్ లెర్నింగ్‌పై మండలంలోని గణిత, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణలో ఏఐ, డాటాసైన్‌లపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. శిక్షణలో ఆర్‌పీలుగా మధుసూదన్‌రావు, సరిత, రచన, మంజులతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దు..

- దర్గాను తొలగించాకే హిందూ దేవుళ్లను ముట్టుకోవాలి
- బీజేపీ నేత ప్రతాప రామకృష్ణ డిమాండ్



రాజన్న ఆలయం ఎదుట మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజన్న భక్తుల మనోభావాలతో దేవదాయ శాఖ అధికారులు ఆడుకోవద్దని, హిందువుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికావొద్దని బీజేపీ నేత ప్రతాప రామకృష్ణ హెచ్చరించారు. రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణలో భాగంగా బుధవారం ఆలయంలో భక్తులకు దర్శనాలను నిలిపివేశారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయం ఎదుట బీజేపీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒకప్పటి నిజాం ప్రాంతం ఇలవేల్పు వేములవాడ రాజన్న అని, ప్రపంచంలో ఎక్కడాలేని విశిష్టత రాజన్న ఆలయంలోని కోడెమొక్కుకు ఉన్నదన్నారు. ఎంతో మంది భక్తులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునేందుకు వస్తారని, ఎప్పుడు దేవాలయాన్ని మూసివేస్తారో.. ఎప్పుడు తెరుస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. ఆలయ అభివృద్ధిపై ఒక ప్రణాళిక లేదని, అధికారుల సమన్వయం లేదని విమర్శించారు. హిందువుల పట్ల విశ్వాసం లేకుండా వ్యవహరిస్తున్నారని, దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ముందు భాగంగా వీక్షించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. దర్గా విషయంపై ఇప్పటికీ క్లారిటీ లేదని, దర్గాను తీస్తున్నారా.. లేదా.. అనే అంశంపై క్లారిటీ ఇవ్వాలని, దర్గాను ముట్టకుండా హిందు దేవాలయాలను తొలగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, పెన్నింటి హన్మాండ్లు, మేర్గు లక్ష్మణ్, నామాల శేఖర్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల్లో సేవలపై అవగాహన కల్పించాలి

- పౌష్టికాహారం ఇవ్వాలి.. ఉత్తమ సేవలు అందించాలి - ప్రతి వారం ఎగ్ బిర్యానీ పెట్టాలి
- మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితరామచంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న అనితరామచంద్రన్

సిరిసిల్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే అన్ని సేవలపై విస్తృత ప్రచారం కల్పించాలని మహిళా, శిశుసంక్షేమశాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ ఆదేశించారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి మహిళా, శిశు సంక్షేమ శాఖపై సంబంధిత అధికారులతో అనితరామచంద్రన్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పోషణలోపంతో బాధపడుతున్న వారి వివరాలు అధికారుల నుంచి తెలుసుకున్నారు. పోషణలోపంతో బాధపడుతున్న వారికి అందించాల్సిన సేవల గురించి అందుతున్న సేవల స్థితిగతులపై ఆరా తీశారు. అలాగే ప్రభుత్వం తరపున అందిస్తున్న ఆహార పదార్థాలు సక్రమంగా చేరుతున్నాయా లేదా అనేది పరిశీలించారు. అలాగే సూపర్వైజర్లను అడిగి వారి సమస్యలపై ఆరా తీశారు. అంగన్‌వాడీలలో పిల్లల హాజరు శాతం పెంచడానికి చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. ప్రతి వారం ఎగ్‌బిర్యానీ పెట్టాలని ఆదేశించారు. గర్భిణులకు ప్రతి అంగన్‌వాడీకి రెండు చొప్పున బెంచీలు అందిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే పోషన్ ట్రాకర్, ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లలో లబ్ధిదారుల సంఖ్యను పోల్చిచూసి పరిశీలించారు. సఖి ద్వారా అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అలాగే అందరూ వారి కాళ్ల మీద వాళ్లు నిలబడడానికి అవసరమైన సహాయసహకారాలు అందించడానికి నైపుణ్య శిక్షణ ఇవ్వవలసిందిగా ఆదేశించారు. బాల్యవివాహాలు జరగకుండా గ్రామాల్లో బేటీ బచావో బేటీ పడావో ద్వారా ప్రత్యేక కళాజాత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులపై ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా ఇంటర్నల్ కమిటీలను ఏర్పాటు చేయాలని, వారందరికీ చట్టంపైన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దివ్యాంగులకు వయోవృద్ధులకు ఉపకరణాలు పరికరాలు అందించాలని సూచించారని తెలిపారు. ఎంతో శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ప్రస్తుతం జరిగిన క్యాంపుల వివరాలను పరిశీలించి విజయవంతం కావడానికి కృషిచేసిన సిబ్బందికి అభినందనలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించబోతున్న డేకేర్ సెంటర్ గురించి అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు, వయోవృద్ధులందరికీ పరికరాలు అందించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ వయోవృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించి వారికి ఎలాంటి వసతులు అందుతున్నాయనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడి ఝాన్సీ, జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం, సీడీపీవోలు ఉమారాణి, సౌందర్య, డీహబ్ కోఆర్డినేటర్ రోజా, డీసీపీఓ కవిత, సఖి కోఆర్డినేటర్ మమత, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ బాలకిషన్, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో విస్తరణ, అభివృద్ధి పనులకు భక్తులు, పట్టణ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. బుధవారం రాజన్న క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం ప్రచార రథం వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఆయన ప్రారంభించి తెరపై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు కొనసాగుతున్నందున రాజన్న ఆలయంలో దర్శనాలు నిలిపివేసి భీమేశ్వరాలయంలో దర్శనం, ఆర్జిత సేవలను ఇప్పటికే అమలు చేస్తున్నామన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వందేళ్లయినా చెక్కు చెదరకుండా దేవాలయం ఉండే విధంగా తీర్చిదిద్దే విధంగా రూపకల్పన చేశామన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరి సలహాలు, సూచనలతోనే ప్రజా ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. ఎవరి మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వ చర్యలు ఉండవన్నారు. అందరూ దేవాలయ అభివృద్ధిలో కలిసిరావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆలయంలో విస్తరణ పనులను ఎమ్మెల్యే పర్యవేక్షించారు.

ప్రధాన ద్వారం వద్ద భారీ పోలీసు బందోబస్తు..

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయంలో స్వామివారి దర్శనాలు నిలిపివేసిన నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి అంతా పోలీసు పహారా ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన గేటు వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద భద్రతా ఏర్పాట్లను సిరిసిల్ల అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఇనెస్పెక్టర్ రవికుమార్‌లతో కలిసి పర్యవేక్షించారు.

ప్రధాన రహదారిపై మరమ్మతు పనులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదిర గ్రామ శివారులోని చిట్టివాగు వంతెన వద్ద కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం మరమ్మతు పనులను చేపట్టారు. గుంతను పూడ్చివేసి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలి

- రైతు బజార్‌లోనే అన్ని అమ్మకాలు జరగాలి - ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



రైతు బజార్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్



రైతులు, వ్యాపారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

సిరిసిల్ల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. బుధవారం సిరిసిల్ల పట్టణ శివారులోని కొత్త చెరువును ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ పరిశీలించారు. కొత్త చెరువు కట్టను పరిసరాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొత్త చెరువుతో పాటు పరిసరాలను నిత్యం శుభ్రం చేయాలని పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. అందుకు అవసరమైన యంత్రాలు, సామగ్రిపై ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ కమిషనర్ ఖదీర్‌పాషాను ఆదేశించారు. పట్టణ ప్రజలు పూర్తిగా కొత్త చెరువును వినియోగించుకునేలా సుందరీకరించాలని అన్నారు. అనంతరం రగుడు సమీపంలోని మున్సిపల్ డంపింగ్ యార్డ్‌ను ఇన్‌చార్జి కలెక్టర్ సందర్శించారు. తడిపొడి చెత్తను వేరు చేసే విధానాన్ని, కంపోస్ట్ తయారీ విధానాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. డంపింగ్ యార్డ్‌కు కావాల్సిన యంత్రాలు, పరికరాలకు ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అక్కడి నుంచి సిరిసిల్ల పట్టణంలోని రైతు బజారుకు చేరుకొని రైతు బజారును సందర్శించారు. రైతు బజారులోని రైతులు, కూరగాయల వ్యాపారులతో ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడారు. రైతు బజారులో వారి సౌకర్యాలపై ఆరా తీశారు. స్లాటర్ హౌస్ నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ రైతు బజార్‌లోనే పూర్తిగా విక్రయాలు జరపాలన్నారు. చికెన్, మటన్, చేపలు, కూరగాయల విక్రయాలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి కలెక్టర్ వెంట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీవీహెచ్‌వో రవీందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, తహసీల్దార్ మహేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్‌పాషా, సిబ్బంది, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఉన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్ అన్నారు. బుధవారం వేములవాడ సీనియర్ సివిల్ కోర్టు హాలులో ఈనెల 15న నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్ సందర్భంగా పోలీసు అధికారులు, ఏపీపీలతో సమన్వయం సమావేశం నిర్వహించారు. వేములవాడ కోర్టులలో దాదాపు 4800 పెండింగ్ కేసులు ఉన్నాయన్నారు. ఇందులో 1200 కేసులు పరిష్కరించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. లోక్ అదాలత్‌లో రాజీకి ఆమోదమైన సివిల్, క్రిమినల్‌కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ప్రత్యేక లోక్ అదాలత్ సందర్భంగా ఇరువర్గాలు రాజీపడి వారి కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఉచిత న్యాయం కోసం న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసు అంతిమ తీర్పు అన్నారు. దీనివల్ల పరిష్కరించుకుంటే కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా కావడమే కాకుండా పై కోర్టు వెళ్లే అవకాశం లేదన్నారు. ఈ సమావేశంలో వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి, ఏపిపి రజనీకాంత్, వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం, చందుర్తి ఎస్ఐ రమేశ్, రుద్రంగి ఎస్ఐ శ్రీనివాస్, బోయిన్‌పల్లి ఎస్ఐ రమాకాంత్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి

● భార్యకు తీవ్ర గాయాలు


ఆవుల రవి(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోర్టు సమీపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆవుల రవి(42) దుర్మరణం చెందాడు. అతని భార్య సంతోషినికి తలకు గాయాలయ్యాయి. త్రీటౌన్ సీఐ జి జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేశవాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఆవుల రవి కరీంనగర్‌లోని రాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో భార్య సంతోషినితో కలిసి మోటార్‌సైకిల్‌పై కోర్టు చౌరస్తా నుంచి మంచిర్యాల చౌరస్తా వైపునకు వెళ్తున్నారు. రోడ్డు పక్కన పార్క్ చేసి ఉన్న కారును డ్రైవర్ హటాత్తుగా రోడ్డుపైకి రావటంతో వీరి బైక్‌ను కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఆవుల రవి కుడిపక్కకు, ఆయన భార్య సంతోషిణి ఎడమ పక్కకు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో అదేదారిలో ఒక ట్యాంకర్ అతివేగంగా వచ్చి రవిని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయుడు రవి అక్కడికక్కడే మృతి చెందాడు. సంతోషిణి తలకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. మృతుడు రవికి కొడుకు రిత్విక్, కూతురు హాసిని ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

బావిలో దూకి విద్యార్థి ఆత్మహత్య


విశ్వతేజ్(ఫైల్)

పెద్దపల్లిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బావిలో దూకి ఓ విద్యార్థి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే పెద్దపల్లి పట్టణంలోని భూంనగర్‌కు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఈర్ల స్వరూప సురేందర్‌ల ఏకైక కుమారుడు విశ్వతేజ్(17) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. మంగళవారం కాలేజీ నుంచి ఇంటికి వచ్చిన విశ్వతేజ్ సాయంత్రం వరకు స్నేహితులతో గడిపాడు. అనంతరం బంధంపల్లి వద్ద రాజీవ్‌రహదారి పక్కన ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. ఫోన్లు చేసి తెలుసుకునే ప్రయత్నం చేశారు. బుధవారం ఉదయం బంధంపల్లి బావి వద్ద సెల్ ఫోన్, చెప్పులు కనిపించడంతో తల్లిదండ్రులకు సమాచారం అందింది. దీంతో జాలర్లను పిలిపించి బావి అంతా వెతికించారు. సుమారు గంట పాటు వెతకగా మృతదేహం లభించింది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులకు దిక్సూచి.. అంబేడ్కర్ స్టడీ సర్కిల్



కరీంనగర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్


స్టడీ సర్కిల్‌లో విద్యార్థులు

● నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ
● ఇప్పటి వరకు ఉద్యోగాలు సాధించిన 286 మంది అభ్యర్థులు

గణేశ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ రంగాల్లో ఎన్నిక అవకాశాలున్నా ప్రభుత్వ ఉద్యోగాలకున్న విలువ ఎప్పటికీ తగ్గదు. అందుకే వందల్లో ఉద్యోగాలుంటే లక్షల్లో దరఖాస్తులు వస్తుంటాయి. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం కష్టపడి చదువుతున్నారు. అటువంటి వారికి మార్గనిర్దేశం చేస్తూ అవసరమైన శిక్షణ అందిస్తోంది ఎస్సీ స్టడీ సర్కిల్. ప్రైవేట్ సంస్థల్లో లక్షలు పెట్టి చదవలేని వారికి అండగా నిలుస్తోంది. 2016 సంవత్సరంలో కరీంనగర్‌లో అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటైంది. ఇక్కడ శిక్షణ తీసుకున్న 286 మంది అభ్యర్థులు ఉద్యోగాలను సాధించారు.

● అర్హత.. శిక్షణ.. సౌకర్యాలు

కనీసం డిగ్రీ పాసై వార్షిక ఆదాయం మూడు లక్షల రూపాయల లోపు ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు అర్హులు tsstudycircle.co.in అనే వెబ్సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనపరచిన వంద మందికి ఐదు నెలలపాటు ఉచిత శిక్షణను అందిస్తారు. ఫౌండేషన్ కోర్స్ పేరున ఇస్తున్న ఈ శిక్షణలో పలు నోటిఫికేషన్ల సిలబస్‌ను కవర్ చేసే విధంగా నిష్ణాతులైన అధ్యాపకులు బోధిస్తారు. ఉచిత శిక్షణ, ఉచిత భోజన వసతి ఉంటుంది. ఇతర అలవెన్స్‌ల కింద పుస్తకాల కొనుగోలుకు ఒక్కరికి 2500 రూపాయలు ఇస్తారు. నోట్‌బుక్స్, బౌండెడ్ మెటీరియల్ ఉచితంగా ఇస్తారు. ఇప్పటి వరకు రెసిడెన్షియల్ విధానంలో 10 బ్యాచ్‌లలో 918 మందికి, నాన్ రెసిడెన్షియల్ విధానం లో 2 బ్యాచ్‌లలో 264 మందికి శిక్షణ ఇచ్చారు. మొత్తం 12 బ్యాచ్‌లలో 1,182 మంది శిక్షణ పొందగా వారిలో ఇప్పటి వరకు 286 మంది ఉద్యోగాలను సాధించారు. మరో 16 మంది ఉద్యోగాలకు ఎన్నికయ్యారు. వారికి నియామకపత్రాలు రావాల్సి ఉంది.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

-బండ శ్రీనివాస్,
అంబేడ్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్



విద్యార్థులు డిగ్రీ కనీస అర్హతతో వ్రాయడానికి వీలైన అన్ని పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నాం. ఆడియో, వీడియోల బోధన ఉంటుంది. మోడల్ టెస్టులు నిర్వహించి అభ్యర్థుల సామర్థ్యాన్ని తెలుసుకుంటున్నాం. ఉచిత శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.

శిక్షణ చాలా ఉపయోగపడింది..

- గొల్లపల్లి రాజు, డిప్యూటీ తహసీల్దార్



డబ్బులు చెల్లించి కోచింగ్ తీసుకునే పరిస్థితి లేని సమయంలో కరీంనగర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో ఇచ్చిన కోచింగ్ నాకు చాలా ఉపయోగ పడింది. ఐదు నెలల శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. మాకు ఇచ్చిన కోచింగ్, మెటీరియల్ చాలా ఉపయోగపడింది.

నాణ్యమైన కోచింగ్ ఇస్తున్నారు..

- బి ధనుంజయ్, సూపరింటెండెంట్,
పీవీ నరసింహరావు వెటర్నరీ యూనివర్సిటీ



అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో నాణ్యమైన కోచింగ్ ఇస్తున్నారు. ఇక్కడ కోచింగ్ తీసుకున్న తర్వాతే ఉద్యోగం సాధించగలనని నమ్మకం కలిగింది. ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న వారు ఇక్కడ కోచింగ్ తీసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చు.

టిప్పర్ ఢీకొని గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రెలు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి గ్రామశివారులో టిప్పర్ ఢీకొని తొమ్మిది గొర్రెలు అక్కడిక్కడే మృతిచెందాయి. మరికొన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. బుధవారం పెగడపల్లి శివారులోని శ్రీమల్లి కార్జున ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ టిప్పర్ గొర్రెలను ఢీకొంది. ఇందులో తొమ్మిది గొర్రెలు మృతిచెందగా, రెండు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. సుల్తానాబాద్ నుంచి కాల్వశ్రీరాంపూర్ వస్తున్న టిప్పర్ రోడ్డు దాటుతున్న గొర్రెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని యజమాని పల్లపు మల్లయ్య పేర్కొన్నాడు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతకుంటపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఒక గేదె మృతి చెందింది. బుధవారం గ్రామానికి చెందిన లింగంపల్లి కొమురయ్య గేదె మేతకు వెళ్లగా అక్కడ నీటిలో ఉన్న ఐరన్ విద్యుత్ స్తంభానికి తాకి విద్యుదాఘాతంతో మృతి చెందింది. గేదె విలువ రూ.60 వేల వరకు ఉంటుందని, తనకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని రైతు కొమురయ్య విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

కోల్‌సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన కనకం గణేష్‌పై మంగళవారం రాత్రి దాడికి పాల్పడిన నల్లగొపాల రంజిత్, అతని భార్య లతపై కేసు నమోదు చేసినట్టు గోదావరిఖని వన్‌టౌన్-2 సీఐ రవీందర్ తెలిపారు. కనకం గణేష్ మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా అదే కాలనీకి చెందిన రంజిత్ తనను ఇంటి వద్ద దింపాలని కోరాడు. అతన్ని ఇంటి వద్ద దింపిన తరువాత తనపై ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ కులం పేరుతో దూషిస్తూ కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసి చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడని, అతని భార్యను కత్తి తీసుకురా అని పురమాయించినట్టు తెలిపారు. గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంజిత్, అతని భార్య లతపై కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

లంచం అడిగారా... 1064కు కాల్ చేయండి

● 10 నెలల్లో 22 కేసులు, 35 మంది అరెస్టు ● ఉమ్మడి కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్



కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విధిగా చేయాల్సిన పనికోసం ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే వెంటనే ధైర్యంగా అవినీతి నిరోధకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఉమ్మడి కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సమాజంలో అవినీతి ఒక పెద్ద సమస్యగా మారిందన్నారు. ఆ అవినీతి జాడ్యాన్ని అరికట్టే శక్తి మన చేతుల్లోనే ఉందన్నారు. లంచం అడగడం నేరమని, లంచం తీసుకోవడం కూడా నేరమని, లంచం ఇవ్వడం కూడా నేరమని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, పౌరులకు సేవలు అందించాల్సిన ఉద్యోగి విధులను మరచి అవినీతికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ స్థాయిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం అడిగితే భయపడకుండా వెంటనే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఏసీబీ పోలీసులకు నేరుగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి పేరు, వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు అవినీతిపై చైతన్యవంతులై తిరగబడితేనే అవినీతి రహిత తెలంగాణ సాధ్యమన్నారు. సత్యం కోసం, మన కర్తవ్యం కోసం, అవినీతి రహిత తెలంగాణ కోసం సంకల్పంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 2025 సంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు లంచం డబ్బులు తీసుకుంటుండగా ఇప్పటి వరకు 22 కేసుల్లో 35 మంది ఉద్యోగులు, వారి సహాయకులను అరెస్టు చేసి జైలుకు తరలించామన్నారు. ఇందులో రెవెన్యూశాఖకు చెందిన ఎనిమిది మంది ఉద్యోగులు, పంచాయతీ రాజ్ శాఖ-6, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ- 3, ఖజానా శాఖ 3, మున్సిపల్-3, వ్యవసాయశాఖ-3, డ్రగ్ కంట్రోల్-3, ఆర్‌టీఏ-3, పోలీసుశాఖలో ఒక కేసు నమోదు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తిచెంది, మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ బుధవారం రాత్రి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన జెట్టి రాజ కొమురయ్య(60) భార్య నాలుగు సంవత్సరాల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. తీవ్రమానసిక వేదనకు గురై కొడుకు సదయ్య చెంతనే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి కదంబాపూర్ శివారులో ఉన్న తమ పొలం వద్ద గల వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లి వెంటతెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న తండ్రిని చూసిన కొడుకు వెంటనే కొమురయ్యను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం అతన్ని కరీంనగర్‌లో ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తికి చెందిన పరశురాం అనే వ్యక్తి కాలినడకతో వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో పరశురాంనకు తీవ్రగాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

జీడీకే11 ఇంక్లైన్‌లో ప్రమాదం

● ముగ్గురు కార్మికులకు గాయాలు

గోదావరిఖని, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే 11ఇంక్లైన్‌లో బుధవారం గనిలో ప్రమాదం జరిగింది. రెండవ షిఫ్టులో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. ఎల్‌హెచ్‌డీ సెక్షన్‌లో ఎల్‌హెచ్‌డీలు నడుపుతున్న క్రమంలో వాహనం వెనుక పనులు చేస్తున్న కార్మికులు రంజిత్, శ్రీకాంత్, ప్రవీణ్‌కు అక్కడున్న కేబుల్ వైర్ బలంగా తాకినట్టు తెలిసింది. దీంతో వారు కిందపడ్డారు. శ్రీకాంత్, ప్రవీణ్‌కు స్వల్ప గాయాలు కాగా, రంజిత్‌కు బలమైన గాయాలు తగిలాయి. స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వీరికి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లి నర్సయ్యపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులో గల ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఓ కార్మికుడు బుధవారం రాత్రి రాజీవ్‌రహదారి దాటుతుండగా రోడ్డుపై వెలుతున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో కార్మికుడితో పాటు ద్విచక్రవాహనం నడుపుతున్న వ్యక్తి కూడా తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బిల్డింగ్ పైనుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రంగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్‌కు నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కిందపడి తీవ్రగాయాలపాలైన సంఘటన రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం ఉదయం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన గంధం శంకర్ తన ఇంటి నిర్మాణంలో భాగంగా గోడలకు నీళ్లు పడుతున్న క్రమంలో ఒక్కసారిగా మొదటి అంతస్తు నుంచి కిందపడ్డాడు. దీంతో తలకు, నడుముకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

రిటైర్డ్ ఏఎస్సై రామచంద్రం కన్నుమూత


రాంచంద్రం(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేసి, రిటైర్డ్ అయిన ఏఎస్సై మడుపు రామచంద్రం(69) బుధవారం అనారోగ్యంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రామచంద్రం అంత్యక్రియలు ఆయన స్వగ్రామం కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో గురువారం మధ్యాహ్నం నిర్వహించనున్నారు. రాంచంద్రం మృతికి పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు. సుదీర్ఘకాలంపాటు పోలీస్ శాఖకు రామచంద్రం అందించిన సేవలు మరువలేనివన్నారు. సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా ఆయన చేసిన కృషి ఎంతోమందికి ఆదర్శప్రాయమన్నారు.

పెద్దమ్మ ఆలయంలో పోతరాజు విగ్రహం ధ్వంసం

ఓదెల, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లిలో బుధవారం పెద్దమ్మతల్లి ఆలయంలో నిర్మించిన పోతరాజు విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేశాడు. రాత్రి మద్యం సేవించిన ఒకవ్యక్తి పొత్కపల్లి రైల్వేస్టేషన్ నుంచి వస్తూ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు తెలిసింది. ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగించారు.

బహ్రెయిన్‌లో జగిత్యాల యువకుడి ఆత్మహత్య

● పుట్టిన రోజునే ఘటన
● జగిత్యాలలో మిన్నంటిన రోదనలు


జగిత్యాలలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు , కళ్యాణ్ (ఫైల్)

జగిత్యాల టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎదిగిన కొడుకు కుటుంబానికి ఆసరాగా ఉంటాడని గల్ఫ్‌కు పంపిస్తే ఏం జరిగిందో ఏమే కానీ పుట్టిన రోజునే తల్లిదండ్రులతో సంతోషంగా మాట్లాడిన ఆ యువకుడు ఆతహత్య చేసుకుని ఆ కుటుంబంలో విషాదం నింపాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని టాకా సందిలో ఉంటున్న అనుమల్ల శంకర్ ఓ కలర్స్ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తుండగా ఆయన భార్య లావాణ్య ఆశ వర్కర్‌గా పని చేస్తున్నారు. వారికి కల్యాణ్ (26)కొడుకు, ఒక కూతురు ఉన్నారు. ఎదిగిన కొడుకును గల్ఫ్‌కు పంపితే నాలుగు రూపాయలు సంపాదించి ఇంటికి చేదోడుగా ఉంటాడని 10 నెలల క్రితం కల్యాణ్‌ను బహ్రెయిన్ దేశానికి పంపించారు. అక్కడ ఓ సర్వీసింగ్ సెంటర్లో పనిచేస్తూ ప్రతి నెలా ఇంటికి డబ్బులు పంపించేవాడు. మంగళవారం రోజున కళ్యాణ్ బర్త్‌డే సందర్భంగా కుటుంబ సభ్యులతో కూడా చాలా సంతోషంగా మాట్లాడాడు. రాత్రి ఏం జరిగిందో ఏమోకానీ ఉదయం చూసేసరికి తన గది వద్ద కల్యాణ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని కల్యాణ్ స్నేహితులు జగిత్యాలలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తన కొడుకుకు ఎలాంటి ఇబ్బందులు లేవని, ఎప్పుడు తమతో సంతోషంగానే మాట్లాడేవాడని బర్త్‌డే సందర్భంగా కూడా మాతో ఫోన్‌లో సంతోషంగానే మాట్లాడాడని అంతలోనే ఏం జరిగిందో అంతుపట్టడం లేదని యువకుడి తండ్రి రోదిస్తూ తెలిపాడు. ఆత్మహత్యకు కారణాలు తెలుసుకొని మృతదేహాన్ని త్వరగా తెప్పించే ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

వెల్గటూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో బుధవారం ఓ యువకుడు ఎనగందుల పోచయ్య అనే వృద్ధుడిని ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సంత కావడంతో పోచయ్య సంత నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో శాఖాపూర్‌కు చెందిన యువకుడు బైక్‌పై వెళ్తూ వృద్ధుడిని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో వృద్ధుడు కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోచయ్యను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ట్రాలీ బోల్తా.. తప్పిన ప్రాణాపాయం


రోడ్డుపై పడిపోయిన ఫైబర్ కర్రలు

వెల్గటూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం రాజక్కపల్లి వద్ద రాష్ట్ర రహదారిపై బుధవారం ట్రాలీ బోల్తా పడగా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి పోయాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ గోషామహల్ నుంచి ఫైబర్ లోడ్‌తో లక్షెట్టిపేట వైపు వస్తున్న ట్రాలీ రాజక్కపల్లి సమీపంలో టైరు పేలడంతో రాష్ట్ర రహదారిపై బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడడంతో ప్రాణాపాయం తప్పింది. ట్రాలీ ఉన్న ఫైబర్ కర్రలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయాయి. దీనితో రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అదే గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ స్పందించి స్థానిక యువకుల సహాయంతో కర్రలను తొలగించారు. కాగా ట్రాలీ వెనుక ముందు ఎలాంటి వాహనాలు రాక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఏఎస్సై శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

భక్తుల దారి దోపిడీ

● బంగారు పుస్తెల తాడు, నగదు లాక్కెళ్లిన అగంతకుడు



వృద్ధుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి ఆటోలో వెళుతున్న భక్తులను లక్ష్యంగా చేసుకున్న అగంతకుడు వెంబడించి బుధవారం దారి దోపిడీకి పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన దేవపల్లి బూదవ్వ, చంద్రయ్య అనే వృద్ధ దంపతులు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనం చేసుకొని నాంపల్లికి వెళుతున్నారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి నాంపల్లి దేవాలయానికి వెళ్లేందుకు భక్తులు ఆటోలో ఎక్కగా మార్గమధ్యలో ఒక వ్యక్తి, మరోచోట ఇంకో వ్యక్తి ఎక్కారు. నాంపల్లి కమాన్ వద్ద భక్తులు దిగగానే అగంతకుడు దిగి వారిని వెంబడించి నడుచుకుంటూ వెళుతున్న దంపతులను చంపుతానని బెదిరించి రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు, రూ. 2వేల నగదు లాక్కొని పరారయ్యాడు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


హర్షిత్(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువ కుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పోతిరెడ్డిపేటకు చెందిన నందిపేట హర్షిత్(18), అతడి బంధువు త్రివేష్ ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్ వైపు వెళ్తున్నారు. సిర్సపల్లి క్రాస్ రోడ్డు సమీపంలోకి రాగానే వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీంది. ఈ ప్రమాదంలో హర్షిత్, త్రినేష్ ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నందిపేట హర్షిత్ మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

ఒకరి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

యైటింక్లయిన్ కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కాలనీలోని భాస్కర్‌రావు నగర్‌కు చెందిన బండారి శ్రీనివాస్(42) బుధవారం ఉరి వేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో బెడ్‌రూంలో చీరతో సీలింగ్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తాడిచర్ల ఓసీపీలో బ్లాస్టింగ్ సెక్షన్‌లో ప్రైవేట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ పెళ్లిరోజు బుధవారం కావడం తో కుటుంబంలో విషాదం నింపింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాస్ మృతికి కారణాలు తెలియరాలేదు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

16న ఉమ్మడి జిల్లాస్థాయి

జూనియర్స్ ఖో-ఖో పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్స్ ఖో-ఖో పోటీలను ఈ నెల 16న కోరుట్లలో నిర్వహించనున్నట్లు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు తెలిపారు. కోరుట్ల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం 9:30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో కరీంనగర్ నుంచి రెండు బాలుర, ఒక బాలికల జట్టు, జగిత్యాల నుంచి రెండు బాలుర, ఒక బాలికల జట్టు, సిరిసిల్ల నుంచి రెండు బాలుర, ఒక బాలికల జట్టు పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచే జట్లకు నగదు బహుమతులతోపాటు ప్రతిభచాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. బాలబాలికల ఎత్తు, వయస్సు, బరువు మొత్తం కలిసి 250 పాయింట్లు దాటకూడదని పేర్కొన్నారు. పోటీలను లీగ్‌కం నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నామని తెలిపారు. ఇతర వివరాలకు పోటీల నిర్వాహక కార్యదర్శి వి.నవీన్‌కుమార్ 8341136941 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పత్రికలు చదవడం పెరగాలి

- ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

సిరిసిల్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వినియోగం తగ్గించుకుని పత్రికలు చదవాలని ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమల సత్యం అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడారు. డిస్ట్రిబ్యూషన్ కమిషన్ పెంచాలని అన్నారు. రాష్ట్ర కోశాధికారి ఉప్పు రాజేందర్, రాష్ట్ర ఆర్గనైజర్ కార్య దర్శి రణం రవీందర్‌గౌడ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కురికాల ప్రసాద్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పోచపల్లి రాజు ఉన్నారు.

- అర్ధరాత్రి తర్వాతనే ప్రధాన ద్వారం మూసివేత
- ముందస్తు సమాచారం లేకపోవడంతో భక్తుల ఆందోళన
- భీమేశ్వరాలయంలోనే భక్తులకు దర్శనం, ఆర్జిత సేవలు
- ఎల్ఈడీ తెరపై రాజన్న దర్శనం
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు


ఎల్ఈడి తెరపై రాజన్నను దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

పోలీసు పహారాలో దక్షిణభాగం ప్రధాన ద్వారం

రాజన్న దర్శనాల నిలిపివేత

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల నేపథ్యంలో స్వామివారి దర్శనాలను బుధవారం తెల్లవారుజామున ముందస్తు సమాచారం లేకుండానే నిలిపివేశారు. భక్తులు ఆలయంలోకి రాకుండా తూర్పువైపున ఉన్న రాజగోపురం దక్షిణం వైపున్న ప్రధాన ద్వారం గేటును మూసివేసి ఇనుప రేకులతో ఫెన్సింగ్ చేశారు. ఆలయం చుట్టూ ఇప్పటికే పడమర, ఉత్తరం వైపు ఎత్తయిన రేకులతో ఫెన్సింగ్ చేసి రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా నెలరోజుల నుంచి కూల్చివేతలు కొనసాగుతున్నాయి. దక్షిణం, ఉత్తర భాగాల్లో ఉన్న ప్రాకారం, పడమర వైపున్న నైవేద్యశాల, ఈవో కార్యాలయం, తూర్పు భాగంలోని కళాభవన్‌లను ఇప్పటికే తొలగించారు. చివరికి మెయిన్ గేట్‌ను ఇనుప రేకులతో మూసివేశారు. కోడె మొక్కులు, ఆర్జిత సేవలు భీమేశ్వరాలయంలో జరుగుతాయని పేర్కొంటూ ప్రధాన ద్వారానికి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దర్శనాల నిలిపివేత పనులను ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయి, అడిషనల్ ఎస్పీ చంద్రయ్యల సమక్షంలోనే రాత్రంతా ఇంజ నీరింగ్ అధికారులు పూర్తిచేశారు. దీంతో సుప్రభాత దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ గేటు వద్దనే టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మరోవైపు పడమర వైపున్న శివుడి విగ్రహం వద్ద కొబ్బరికాయలు కొట్టి దీపాలు వెలిగించారు. ముందస్తు సమాచారం లేకుండా ఆలయంలో దర్శనాలను నిలిపివేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమైంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. భీమేశ్వ రాలయంలో సకల ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రమాదేవి ప్రకటించారు. ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. ఆలయంలో ముందస్తు సమాచారం లేకుండా దర్శనాలను నిలిపివేయడాన్ని బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ తీవ్రంగా ఖండించారు.

అభివృద్ధిలో భాగంగానే రాజన్న దర్శనాలకు తాత్కాలిక ఏర్పాట్లు

- ఆలయ ఈవో రమాదేవి

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగానే స్వామివారి దర్శనాలకు తాత్కాలిక ఏర్పాట్లుచేశామని ఈవో ఎల్. రమాదేవి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ విస్తరణ పనులు వేగవంతం అయినందున భక్తులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నదని గుర్తించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి ఆజ్ఞానుసారం భక్తుల సౌకర్యార్థం ఆలయ రాజగోపురం ఎదురుగా తూర్పువైపు స్వామివారు, అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలైన అభిషేకాలు, అన్నపూజలు, అర్చనలు, కల్యాణాలు ఏర్పాటు చేశామన్నారు. ఇకనుంచి భీమేశ్వరాలయంలో భక్తులు మొక్కులు చెల్లించుకోవాలన్నారు.

భీమేశ్వరాలయంలోనే భక్తులకు దర్శనం..

భక్తులు ఇకనుంచి భీమేశ్వరాలయంలో దర్శన ఏర్పాట్లు చేశారు. అన్ని రకాల ఆర్జిత సేవలు, పూజలు భీమేశ్వరాలయంలో చెల్లించేలా ఏర్పాట్లుచేశారు. ఆలయ అభివృద్ధి పనుల దృష్ట్యా రావిచెట్టు వైపు ఏర్పాటుచేసిన ప్రచార రథంలో రాజరాజేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. అక్కడే ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. గతనెల 20న శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖర భారతితో దీనిని ప్రారంభించారు. ఇకనుంచి ఎల్ఈడీ స్క్రీన్‌లో స్వామివారిని దర్శించుకోవచ్చు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాలాజీ అనే విద్యార్థి జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంపిక పోటీలు శాతవాహన వర్సిటీ పరిధిలో జరిగాయన్నారు. డిసెంబర్‌లో జరగబోయే జాతీయ ఇంటర్ యూనివర్సిటీ ఆల్ ఇండియా బాక్సింగ్ పోటీలు కురుక్షేత్ర విశ్వవిద్యాలయం హర్యానా రాష్ట్రంలో జరుగుతాయని, ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ అశోక్, కళాశాల అధ్యాపకులు, సహచర విద్యార్థులు బాలాజీని అభినందించారు.

వచన కవిత పోటీల్లో విద్యార్థి ప్రతిభ


రాహుల్

ధర్మారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని నర్సింహులపల్లి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అలిశెట్టి రాహుల్ సత్తాచాటాడు. వచన కవిత, పద్య కవిత, కథ, పుస్తకసమీక్ష, చిత్రలేఖనం అంశాలలో పోటీల నిర్వహించగా రెండు రాష్ట్రాల నుంచి 1200మంది విద్యార్థులు పోస్టు ద్వారా తమ రచనలను పంపారు. న్యాయ నిర్ణేతలు బుధవారం విజేతలను ప్రకటించగా వచన కవిత విభాగంలో రాహుల్ రాసిన 'పెన్ను' కవితకు తృతీయబహుమతి లభించింది. ఈ నెల23న, హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సారస్వత పరిషత్తు భవనంలో జరిగే సమావేశంలో రాహుల్‌కు 1000రూపాయల నగదు బహుమతితోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించనున్నారు. రాహుల్‌ను ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయక్, ఉపాధ్యాయులున్నారు.

ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం

కరీంనగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ అనుబంధంగా పనిచేస్తున్న తెలంగాణ మైనార్టీ గురుకుల ఉపాధ్యాయ సంఘం (టెమ్రిస్) ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యదర్శి భూపేందర్‌కౌర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముల్కల కుమార్, కేఎఫ్ జావేద్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒల్లాల శ్రీనివాస్ (కరీంనగర్), ప్రధాన కార్యదర్శిగా షేక్ బాబా, ఉపాధ్యక్షులుగా రెవోజు స్వామి, అనిత, కోశాధికారిగా జి.సంధ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా నిజాముద్దీన్, ఎం.శ్రావణి, కార్యదర్శులుగా కె.శ్రావణి, క్రాంతికుమార్, జి.సుచరిత, ఎన్.హరికృష్ణ, కె.చిరంజీవి, జి.శ్రీకాంత్, డి.శ్రీలత, సంయుక్త, సాహిత్య, డి.వినోద, ఎ.హరీష్, ఎ.శ్రీలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మైనార్టీ గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని వారు కోరారు.

పెన్షనర్ల సమస్యల సాధనకు పోరాటం

- 17న హైదరాబాద్‌లో మహాధర్నా
- 'రేవా' రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి

కరీంనగర్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల సాధనకు పోరాటం చేపట్టినట్లు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి తెలిపారు. బుధవారం నగరంలోని ప్రైవేట్ కళాశాలలో రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె జగదీశ్వరాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడాదిన్నరకాలంగా ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్ మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ అందలేదని ఆవేదన చెందారు. బకాయిలు అందకపోవడంతో పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని అన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతుందని, విధిలేని పరిస్థితిలో మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టాల్సి వస్తోందని అన్నారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద పెన్షనర్ల మహాధర్నా నిర్వహించనున్నట్లు అనంతరం మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకెశాల ప్రభాకర్‌రావు, కోశాధికారి కనపర్తి దివాకర్, సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు వంగ సుధాకర్, పాలోజు రవీందర్ పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు

పరమ పవిత్రం కార్తీక దీపం


ధర్మపురి గోదావరి నది వద్ద హారతి ఇస్తున్న అర్చకులు, మహిళలు

ధర్మపురి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపం పరమ పవిత్రమని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 22వ రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌శర్మ భక్తులను ఉద్దేశించి ధార్మిక ప్రసంగం చేశారు. కార్తీక మాసంలో నెల రోజుల పాటు దీపాలు వెలిగించడం ఎంతో శ్రేష్టమని అన్నారు. అనంతరం రాత్రి వరకు నదీ మాతకు హారతి ఇచ్చారు. మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఉన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


అక్షిత్‌రెడ్డి, సిద్దు

సిరిసిల్ల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ బాలుర జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని వాలీబాల్ అకాడమీకి చెందిన విద్యార్థులు అక్షిత్‌రెడ్డి, సిద్దు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి అండర్-19 విభాగం వాలీబాల్ పోటీల్లో సిరిసిల్ల వాలీబాల్ అకాడమికి చెందిన అక్షిత్‌రెడ్డి, సిద్దు తమ క్రీడా ప్రతిభతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం సిరిసిల్లలో వీరిని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ప్రధానకార్యదర్శి అజ్మీరా రాందాస్, ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, కోశాధికారి కోడం శ్రీనివాస్, గుడ్ల రవి, అకాడమి శిక్షకులు సంపత్, జగన్ అభినందించారు.

రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపిక


రామంచ సహస్ర

ముత్తారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన రామంచ సహస్ర రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికైంది. రాజేశం-వాణి దంపతుల కుమార్తె సహస్ర రామగుండంలోని గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది. అండర్ 14 పోటీల్లో జిల్లాస్థాయి 400మీటర్ల రన్నింగ్ పోటీల్లో 2వ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. సహస్రను ఉపాధ్యాయబృందం, తల్లితండ్రులు అభినందించారు.

ప్రచార రథం వద్ద రాజన్న దర్శనం


పనులు పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి వచ్చిన భక్తులు బుధవారం స్వామివారి దర్శనాలు నిలిపివేయడంతో తూర్పుద్వారం ఎదురుగా ప్రచార రథం వద్ద ఏర్పరిచిన ఎల్ఈడీ ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు ఆలయ ఇవో రమాదేవి పలు సూచనలు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటుచేశారు. క్యూలైన్ ద్వారా భక్తులు ప్రచార రథం వద్దకు చేరుకొని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయం వద్ద బుధవారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. అనంతరం భీమేశ్వరస్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. సాముహిక దీపాలంకరణకు హాజరైన సుహాసీనులకు వాయినాన్ని ఏఈవో శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ కూరగాయల శ్రీనివాస్, నరాల రాజులు పాల్గొన్నారు.

- పనులు పర్యవేక్షించిన ప్రభుత్వ విప్

రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న ఆలయ విస్తరణ పనులను బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యవేక్షించారు. భవనాల కూల్చివేత, శిథిలాల తొలగింపు తదితర పనులను పరిశీలించారు. శిథిలాల తొలగింపు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రచార రథం వద్ద ఎల్ఈడీలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఆర్డీవో రాధాబాయి, ఈవో రమాదేవి, ఏఎస్పీ చంద్రయ్య, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, అర్అండ్‌బీ డీఈ అచ్చయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రిశ్విత

ఇల్లంతకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మామిండ్ల రిశ్విత రాష్ట్రస్థాయి హామర్‌త్రో పోటీలకు ఎంపికయింది. కరీంనగర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో అండర్ 17 విభాగంలో రిశ్విత ఉత్తమ ప్రదర్శన కనబర్చింది. ఈ నెల 15నుంచి హైద్రాబాద్‌లోని జింఖానా స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననుంది. విద్యార్థి ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయుడు దూస రఘుపతి, వ్యాయామ ఉపాధ్యాయుడు సాబీర్‌లతో పాటు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన తాటిపల్లి గురుకుల, బాలికల పాఠశాల విద్యార్థులు

మల్యాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నీరజ, పీడీ అంజయ్య తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో లాస్య, చంద్రకళ అనే విద్యార్థినీలు మూడువేల మీటర్ల రేస్, డిష్కస్‌త్రోలో సిల్వర్, బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే నూకపల్లిలో గల ప్రతిభ స్కూల్‌కు చెందిన హనుమాన్ అనే విద్యార్థి 600మీటర్ల రేస్‌లో వెండి పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని కరస్పాండెంట్ అమీర్ తెలిపారు. ఈ నెల 14 నుంచి నాలుగు రోజుల పాటు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన జరాఫతీమా, మనీషా అనే విద్యార్థినిలు కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొనున్నారు.


బాలికల పాఠశాల విద్యార్థులు

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

మల్యాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోతుల దాడిలో మల్యాల మండల కేంద్రంకు చెందిన రాచర్ల చిన్నమ్మ అనే వృద్ధురాలి కాలుకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స కోసం మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి తీసుకెళ్లగా గాయాలు తీవ్రంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే మండలంలో ఇటీవల కోతుల బెడద అధికమవగా జనాలపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయని పూర్తి స్థాయిలో వైద్యంకు సంబంధించి వ్యాక్సిన్ ఇతరాత్రా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అందుబాటులో ఉంచాలని మాజీ ఎంపీటీసీ రమేశ్ వైద్యాధికారులను కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కరీంనగర్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ త్రీటౌన్ పరిధిలో పోగొట్టుకున్న 20 సెల్‌ఫోన్‌లను బుధవారం టౌన్ ఏసీపీ వెంకటస్వామి యజమానులకు అప్పగించారు. ఆయా సందర్భాల్లో బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఐ జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఫోన్‌లను రికవరీ చేసిన సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ చందన

చందుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ మర్రిపల్లి చందన అన్నారు. చందుర్తి మండలం మరిగడ్డ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, సనుగుల గ్రామంలోని గంగిరెద్దుల కాలనీని సందర్శించారు. బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా భాగస్వాములు కావాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు అంకితభావంతో పని చేయాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని, ఆడపిల్లకు 18 ఏళ్లు, మగ పిల్లాడికి 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లిళ్లు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో పాటు గృహహింస పెరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే 14 ఏళ్లలోపు చిన్నారులను పాఠశాలలకు పంపించాలని చెప్పారు. మధ్యలో చదువు మానిన విద్యార్థులను గుర్తిస్తే వెంటనే పాఠశాలలో చేర్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వినోద్, ఐసిడిఎస్ సిడిపిఓ సుచరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, డిస్టిక్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కవిత, డిసిపిఓ అంజి పాల్గొన్నారు.

గణితంలో రేపాక విద్యార్థిని ఉత్తమ ప్రతిభ


వర్షిణి

ఇల్లంతకుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాక గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొడ్డు వర్షిణి గణితంలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథమటిక్స్ టాలెంట్ పోటీలలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న పోటీలలో తృతీయస్థానంలో నిలిచింది. ఉన్నత విద్యకోసం కార్పోరేట్ కళాశాలలు హస్టల్‌తో పాటు ఉచితంగా విద్యను అందించడానికి ముందుకు వచ్చినట్లు విద్యార్థిని తండ్రి రాజు తెలిపారు. ఈసందర్భంగా వర్షిణీకి మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు రేవతి, గణిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్, పాఠశాల కమిటీ చైర్మన్ లీలలతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఇల్లందకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు. మండలంలోని చిన్నకోమటిపల్లి శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్లు, వారి వద్ద రూ.18,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

బల్దియాలపై బకాయిల భారం

(5వ పేజీ తరువాయి)

రూ.3.47కోట్లు వసూలు చేసి 85.14 శాతం సాధించింది. 2025-26 ఆస్తి పన్నులకు సంబంధించి సిరిసిల్ల మున్సిపాలిటీలో రూ 9.75 కోట్ల లక్ష్యంగా ఉండగా, ఇందులో ఎర్లీబర్డ్‌లో 5 శాతం రాయితీని 5117ఇళ్లకు సంబంధించి రూ2.37 కోట్లు వసూలు కాగా, 24.31శాతం ఉంది. మిగిలిన బకాయిలు 23738 ఆస్తులకు సంబంధించి రూ.3.27 కోట్లు ఉంది. ఇందులో గృహాలు,కమర్షియల్ 2947ఉండగా రూ.91.09 లక్షలు, 2634 కమర్షియల్ భవనాలు ఉండగా రూ 83.27లక్షలు. 18157 గృహాలు ఉండగా రూ 1.52కోట్ల పన్నులు వసుళ్ల చేస్తున్నారు. వేములవాడ మున్సిపాలిటీలో 14831 ఆస్తుల కు సంబంధించి రూ 4.33 కోట్ల లక్ష్యంగా ఉండగా ఇందులో ఎర్లీబర్డ్‌లో 5 శాతం రాయితీతో పాటు ఇప్పటివరకు రూ 1.83 కోట్లు వసూలు కాగా మిగిలిన బకాయిలు రూ.2.50 కోట్లు ఉంది. ఇందులో గృహాలు, కమర్షియల్ 1171 ఉండగా రూ 38.67 లక్షలు, 2297 కమర్షియల్ భవనాలు ఉండగా రూ 50.70 లక్షలు. 11363 గృహాలు ఇండగా రూ 37.85 కోట్ల పన్నులు వసుళ్ల చేస్తున్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలి- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తున్నామని, విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. వేములవాడ పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే గర్ల్స్ రెసిడెన్సీలో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల గురించి, విద్యా ప్రాముఖ్యత, బాల్య వివాహాలపై అవగహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆడపిల్లలను కచ్చితంగా చదివించాలన్నారు. చదువుకునే దశలో ఎవరిని కూడా పనులకు పంపించవద్దని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సహాయసహకారాలు అందించడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని, విద్యార్థులకు అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు. రెసిడెన్సియల్ విద్యార్థులు చదువుకునే పేద పిల్లల కోసం ప్రజా ప్రభుత్వం 40శాతం డైట్ చార్జీలు, 20 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామని అన్నారు. పేద పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని లక్ష్యంతో కామన్ డైట్ మేన్యూ ప్రవేశపెట్టామని తెలిపారు. నూతనంగా 11 వేల టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీచేసి ప్రభుత్వపాఠశాలలో నియమించామని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీలు పదోన్నతులు పారదర్శకంగా చేశామని తెలిపారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసకుని వస్తున్నామని, ఐటీఐ కళాశాలను రతన్ టాటా కంపెనీతో అనుసంధానం చేసుకుని అడ్వాన్స్ ట్రేడ్ సెంటర్లుగా మారుస్తున్నామని వివరించారు. రూ.200కోట్లు ఖర్చు చేసి 20నుంచి 25ఎకరాల స్థలంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణ పనులు ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్, ఎసీడీపీవో సుచరిత, కేజీబీవీ కోఆర్డినేటర్ పద్మజ, సూపర్‌వైజర్ శంకరమ్మ తదితరులు ఉన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఆది శ్రీనివాస్

గంభీరావుపేటలో పారిశుధ్యలోపం..



తాగునీటి ట్యాంక్ వద్ద చెత్తాచెదారం

గంభీరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించింది. రోడ్లకు రెండు వైపులా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోతోంది. కొన్ని కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఎల్లమ్మ కాలనీలో ముళ్లపొదలు పెరిగి రోడ్డు వెంట వెళ్లేవారికి ఇబ్బంది మారాయి. కొన్ని చోట్ల మురుగు నీరు రోడ్డుపై నిల్వ ఉండటంలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. మరికొన్ని చోట్ల మంచినీళ్ళ ట్యాంక్‌ల వద్ద చుట్టు చెదారం పేరుక పోతుంది. పేరుక పోతున్న చెత్తా చెదారం, గడ్డితో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పారిశుధ్యంపై పంచాయతీ పట్టించుకోవాల్సిన అవసరం ఉంతైన ఉంది.

పంచాయతీ అధికారులు పట్టించుకోవాలి..

- కోడె రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు



మండల కేంద్రంలో పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు పట్టించుకోవాలి. మెయిన్‌రోడ్‌పై రెండు వైపుల పిచ్చి మొక్కలు, గడ్డి పేరుకపోతోంది. ఫలితంగా దోమలు అధికమై ప్రజలు జ్వరాల బారిన పడే ప్రమాదం ఉంది. పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగించడంతోపాటు మురికి కాలువలను శుభ్రం చేయాలి.

లక్షలు వెచ్చించినా.. అలంకారప్రాయంగానే..

- వినియోగంలోకి రాని పొన్నాలపల్లె గ్రామపంచాయతీ భవనం



పొన్నాలపల్లె గ్రామపంచాయతీ భవనం..

గంభీరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం పొన్నాలపల్లె గ్రామ పంచాయతీ భవనం ఏళ్ళు గడిచినా వినియోగంలోకి రావడం లేదు. రూ. 25 లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ గ్రామ పంచాయతీ భవనం నిరుపయోగంగా ఉంది. గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం మొదట ఆర్‌జీఎస్‌ఏ గ్రాంటు నుండి రూ. 20 లక్షలు, కలెక్టర్ రెండవ విడత రూ. మరో 5 లక్షల నిధులు మంజూరు చేశారు. కానీ ఇంకా విద్యుత్, శానిటేషన్, లోపల డోర్లు తదితర పనులు మిగిలి ఉన్నాయి. మరో రూ. 5 లక్షల నిధులు మంజూరు అయితే మిగులు పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. పొన్నాలపల్లె గత పంచాయతీ ఎన్నికల సమయంలో కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. పొన్నాలపల్లెతో పాటు మండల పరిధిలో మరో నాలుగు కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు కాగా, అక్కడ నూతన గ్రామ పంచాయతీ భవనాలను ఎప్పుడో ప్రారంభించారు. మిగులు పనులకు నిధులు మంజూరు చేసి, పనులను పూర్తి చేసి గ్రామ పంచాయతీ భవనాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరారు.

డీఐఈవోగా శరత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

సిరిసిల్ల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇంటర్ విద్యాధికారిగా (డీఐఈవో) సీహెచ్ శరత్‌కుమార్ బుధవారం రాత్రి బాధ్యతలను స్వీకరించారు. డీఐఈవోగా విధులు నిర్వహించిన వై శ్రీనివాస్ బదిలీపై ఇంటర్ బోర్డుకి వెళ్లడంతో వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న శరత్‌కుమార్‌ను డీఐఈవోగా నియమించారు. డీఐఈవో కార్యాలయం సిబ్బంది, ప్రభుత్వ అధ్యాపకులు అభినందనాలు తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ

చందుర్తి నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ హక్కుల సాధన సభ విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రాజ్యాంగ హక్కుల సాధన కోసం నవంబరు 26న హలో మాల చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. మండల అధ్యక్షులు ఆశీ నిపర్తి యేసుకుమార్, నాయకులు నీరటి ప్ర సాద్, బత్తుల. శ్రీనివాస్, పాటి జ్యోతికుమార్, నీరటి. సురేష్, బండ శ్రీనివాస్ ఆశీనిపర్తి సు రేష్, బత్తుల అశోక్, బత్తుల ప్రభాకర్ పాల్గొన్నారు.

అద్దె కట్టలేక రోడ్డున పడ్డ కుటుంబం

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో అద్దె కట్టలేక ఓ కుటుంబం రోడ్డున పడింది. వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటకు చెందిన రామిని వరలక్ష్మి తన కూతురు మానస, మనవడు సాయి, మనవరాలు నిహారికలు కొన్నేళ్లుగా వేములవాడలో అద్దెకు ఉంటోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటి అద్దె చెల్లించలేకపోయింది. ఇల్లు ఖాళీ చేసి వేములవాడ అర్బన్ మండలపరిషత్ కార్యాలయం వరండాలో తలదాచుకున్నారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయం తెరవడంతో వరండాలో ఉన్న సామగ్రిని ఖాళీ చేయాలని అధికారులు చెప్పగానే ఎదురుగా ఉన్న ఓపెన్ జిమ్ ప్రాంతానికి తరలించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మానస కోరింది.

హక్కుల సాధన సభను విజయవంతం చేయాలి

- జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య



వేములవాడలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వేములవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ హక్కు సాధన కోసం ఢిల్లీలో ఈనెల 26వ తేదిన నిర్వహించే హలో మాలసభను విజయవతం చేయాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి అంజయ్య, జిల్లా అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ మాట్లాడుతూ మాలల హక్కుల సాధన కోసం హలో మాల- చలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మాలలపై జరుగుతున్న అక్రమాలను నిలదీస్తూ, రాజ్యాంగ విరుద్ధంగా జీవో 99 రోస్టర్ విధానాన్ని తిరిగి పునఃసమీక్షించాలని, ఎస్సీ రిజర్వేషన్ 15 నుంచ 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. నూతన పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరును పెట్టాలని, భారత కరెన్సీ నోట్లపై అంబేద్కర్ చిత్రం ముద్రించాలని పేర్కొన్నారు. దేశంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రత్యేక చట్టం తీసుకురవాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలో 41 సీఆర్సీ సెక్షన్ ద్వారా నిందితులన అరెస్టు చేసే అవకాశం లేకుండా పోతుందని అన్నారు. సీఆర్సీ 41ను వెంటనే రద్దు చేయాలన్నారు. అంతే కాకుండా 12 అంశాలతో కూడిన డిమాండ్లతో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాలలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నాయకులు మూలే కిషోర్, యేసుకుమార్, సిరిగిరి కాంతారావు, సంటి ప్రవీణ్, పంబ ప్రభాకర్, నీరటి కిరణ్, సంటి నవీన్, పాశం కిషన్, మునిందర్, సుధీర్, బాలచందర్, సుధాకర్, దేవరాజు, సదానందం, సత్యం తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

సిరిసిల్ల టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలలో అగ్ని ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాలను ఎలా రక్షించుకోవాలో ఇతరులను ఎలా రక్షించాలో విద్యార్థులకు అగ్నిమాపక అధికారులు అవగాహన కల్పించారు బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ ఆవరణలో అగ్నిమాపక కేంద్రం సిరిసిల్ల అధికారి నరేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా తప్పించుకోవాలో ప్రమాదాలబారిన పడిన వారిని ఎలా రక్షించాలో సిబ్బంది ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఫైర్ ఇంజన్ ఎలా మంటలు ఆర్పుతుందో, ఫైర్ ఇంజన్ ప్రాముఖ్యతను నరేందర్ విద్యార్థులకు వివరించారు. పాఠశాల, కళాశాల, ఇళ్ళలో, ఫ్యాక్టరీలలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే మొట్టమొదటగా 101కు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సమయానికి ఫైర్ ఇంజన్ వస్తే ఆస్తి, ప్రాణ నష్టం జరగదని విద్యార్థులకు సూచించారు.

అనంతరం ఫైర్ ఇంజన్ ద్వారా సిబ్బంది విన్యాసాలు విద్యార్థులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ ప్రిన్సిపాల్ రాజురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు - పది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



రుద్రంగిలో సైకిళ్లు అందజేస్తున్న చెన్నమనేని వికాస్‌రావు



ఎన్గల్‌లో సైకిళ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

రుద్రంగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని వేములవాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సూమారు 70 మందికి మోదీ కానుక సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అందజేస్తున్న సైకిళ్లను వేములవాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ చెన్నమనేని వికాస్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రామకృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు కర్నవత్తుల వేణు, బాల కిషన్, తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : ప్రధాని మోదీ కానుకగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అందిస్తున్న ఉచిత సైకిళ్లను చందుర్తి మండలం ఎనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బీజేపీ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలె విజేందర్, ప్రధానోపాధ్యాయులు సునీత, మోత్కుపల్లి రాజశేఖర్, చిలుముల హన్మయ్యచారి,కుసుంబ లింగారావు, బద్దం తిరుమల్‌రెడ్డి,కొక్కుల నరేష్,తీపిరెడ్డి మనోహర్ రెడ్డి, తర్కె దినేష్, రంజిత్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మానేరు వాగుపై మట్టి రోడ్డు పనులు..

గంభీరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై మట్టి రోడ్డు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భారీ వర్షాలకు నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పొంగిపొర్లింది. దీంతో మానేరు వాగు ఉధృతికి గంభీరావుపేట-లింగన్నపేట మానేరు వాగు రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గం వెంట వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇప్పటికి ఇబ్బందులు పడుతున్నారు. సిద్దిపేట, కామారెడ్డి ఇదే ప్రధాన రోడ్డు కావడం, ఈ మార్గం గుండా వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు, విద్యార్థులు దూర భారంతో ప్రయాణించాల్సి వచ్చింది. మానేరు వాగు తగ్గుముఖం పట్టడంతో సదరు బ్రిడ్జి కాంట్రాక్టర్ తిరిగి మట్టి రోడ్డు పనులు మొదలు పెట్టాడు. విద్యార్థులు కూడా ఇటీవల బ్రిడ్జి పనులతో పాటు మట్టి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆందోళన చేపట్టారు. దీంతో మట్టి రోడ్డు పనులు మరింత వేగంగా కొనసాగుతున్నాయి.



మానేరు వాగుపై కొనసాగుతున్న మట్టి రోడ్డు పనులు

గాలిపల్లిలో ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు..



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి బాల బాలికల కబడ్డీ పోటీలు ముగిశాయి. కబడ్డీ అసోసియేషన్, ఈతరం యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సెలక్షన్, పోటీలలో బాలికల విభాగంలో 14జట్లు, బాలుర విభాగంలో 22జట్లు పాల్గొన్నాయి. పోటీలలో బాలికల విభాగంలో ప్రథమస్థానంలో ఇల్లంతకుంట కస్తూరిభా పాఠశాల, ద్వితీయస్థానంలో రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినులు నిలిచారు. బాలుర విభాగంలో ప్రథమస్థానంలో చెక్కపల్లి, ద్వితీయ స్థానంలో రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు నిలిచారు. ఉత్తమ క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విజేతలకు మంగళవారంరాత్రి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మేకల పావని, కబడ్డీ అసోసియేషన్ జిల్లాకార్యదర్శి సింగారపు తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డు రాములు, తిరుపతి,ఈతరం యువజన సంఘ అధ్యక్షుడు నరేష్, ప్రధానకార్యదర్శి సాయిగణేష్, వ్యాయామ ఉపాధ్యాయులు దేవత ప్రభాకర్, రవీందర్‌రావు, సంపత్‌రావు, సాన బాబు, సంతోష్, మామిడి శ్రీనివాస్, నరేష్, మదన్, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రంగవల్లి విజ్ఞాన కేంద్రం వార్షికోత్సవం

వేములవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ రంగవల్లి విజ్ఞాన కేంద్రం ప్రథమ వార్షికోత్సవం నేడే నిర్వహించున్నట్లు ఆ సంఘం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నందికమాన్ చౌరస్తా సమీపంలోని రంగవల్లి విజ్ఞాన కేంద్రం భవనంలో గురువారం ఉదయం 10 గంటలకు సంక్షోభకాలం- సామాజిక మార్పు, ప్రజా గ్రంథాలయాల ఆవశ్యకత అనే అంశాలపై రంగవల్లి స్మారకోపాన్యాసాలు ఉండనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కవి జూకంటి జగన్నాథం, రచయిత్రి, సామాజిక ఉద్యమకారిణి కొల్లాపురం విమల, అరుణోదయ విమలక్క హాజరుకానున్నట్లు సభ్యులు పోకల సాయికుమార్, రాజేశ్వరి, చెన్నమనేని పురుషోత్తంరావు పేర్కొన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో, బీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తదితరులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎంఈవో కృష్ణహరి అన్నారు. బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన 'మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ప్రచారం' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాగ్యరాజు, ఉపాధ్యాయులతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో కృష్ణహరి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చెడు అలవాట్లతో బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోకూడదని అన్నారు. నేటి యువతో మాదక ద్రవ్యాల వినియోగం వేగంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజానికి ముప్పు వాటిల్లే ప్రమాదం నెలకొంటుందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు భాగ్యరాజు మాట్లాడుతూ యువతలో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతం, చైతన్యమయమైన భారత నిర్మాణానికి పాటుపడాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 రోజుల పాటు అవగాహన ప్రచారాన్ని నిర్వహించనున్నామని భాగ్యరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మనోహరాచారి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చితే భూసారం తగ్గిపోతుంది..

చందుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వరి కొయ్యలను కాల్చడంతో భూసారం తగ్గిపోతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి దుర్గారాజు అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో వరి పంట క్షేత్రాలను బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వరి కొయ్యలు కాల్చడం వల్ల భూసారం తగ్గి, పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. పొలంలో కలియ దున్నితే అది సేంద్రియ ఎరువుగా మారి భూమికి మేలు చేస్తుందన్నారు. కొయ్యలను కాల్చడం వల్ల మిత్ర పురుగులు, భూమిలోని పోషకాలు తగ్గిపోతాయన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే భూసారం తగ్గిపోతుందని, వరి కొయ్యలు కాల్చితే భూమిపై ఉన్న పైపొర గట్టిపడి, నీరు భూమిలోకి ఇంకడం తగ్గిపోతుందన్నారు. నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి పంటకు మేలు చేసే పోషకాలు ఆవిరైపోతాయన్నారు. భూమిలోని మిత్ర పురుగులు, ఎర్రలు చనిపోతాయన్నారు. భూసారం తగ్గడం, పోషకాలు కోల్పోవడం వల్ల దిగుబడి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శిరీష, రైతు సోదరులు పాల్గొన్నారు.

సొంతింటి కలను నెరవేర్చేందుకే ఇందిరమ్మ ఇళ్ల పథకం



సమావేశంలో పాల్గొన్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితరెడ్డి

చందుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలుచేస్తున్నదని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితరెడ్డి అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో అన్నిగ్రామాల ఇందిరమ్మ కమిటీ మెంబర్స్‌తో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీడిప్యూటీ కలెక్టర్ నిఖితరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ.5లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నదని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు త్వరగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధా, గృహ నిర్మాణ శాఖ డీఈ ఖాజా ముజాఫర్, హౌసింగ్ ఏఈ రాజమోహన్, ఏపీఎం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చందుర్తి నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేష్ అన్నారు. మండలంలోని రామన్నపేటలో సైబన్ నేరాలపై ప్రజలకు బుధవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, ఫోన్ ద్వారా ఓటీపీలు అడిగే వారు, బ్యాంకు ఉద్యోగులమని చెప్పే మోసగాళ్లకు చెప్పవద్దన్నారు. అనుమానాస్పద కాల్స్ లేదా యాప్‌ల గురించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఇవి వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబాన్ని, సమాజాన్ని దెబ్బతీసేలా చేస్తాయని హెచ్చరించారు. విద్య, ఉపాధి వైపు దృష్టి పెట్టి సన్మార్గంలో ప్రయాణించాలన్నారు. గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎల్లారెడ్డిపేట, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న పేద దంపతులు నీరంక లత-రవిల వైద్యానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలోని సభ్యులు బుధవారం రూ.12వేల ఆర్థిక సాయం అందజేశారు. రాచర్లగొల్లపల్లిలోని బాల్య మిత్ర ఫౌండేషన్ సభ్యులు రూ.4.5వేలు అందించారు. ఆరేళ్లుగా అనారోగ్యంతో సతమతమవుతున్న వేములవాడ పట్టణంలోని నిరుపేద చింతలతాడెం శంకర్‌కు మండలంలోని సింగారం గ్రామానికి చెందిన హెల్పింగ్ హాండ్స్ సంక్షేమ సంఘం సభ్యులు రూ.5 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో సభ్యులు శంకర్, ముత్యంరెడ్డి, కిషన్, సత్యనారాయణ, రామచంద్రం, దేవయ్య, భాస్కర్‌రెడ్డి, నాగరాజు, వెంకటస్వామి, బాలనర్సు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి చెల్లించాలని విద్యుత్ సరఫరా నిలిపివేత

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బకాయి చెల్లించాలంటూ సెస్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో జాలపల్లి దేవవ్వ తన ఏడాది వయసు ఉన్న మనవడు, కోడలు చీకట్లో గడపాల్సి వచ్చింది. ఈసంఘటన వీర్నపల్లి మండలం అడవిపదిరలో బుధవారం చోటుచేసుకుంది. గత కొన్నేళ్లుగా కరెంటు బిల్లు చెల్లించకపోవడం వల్ల రూ.90వేలు బకాయి పేరుకుపోయింది. అందులో రూ.30వేలను అధికారులు మాఫీచేసి రూ.60వేలు చెల్లించాలని సెస్ అధికారులు, సిబ్బంది సూచించారు. అయినా చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరాను తొలగించారు. చీకటిలో మగ్గుతున్న తమకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని బాధితురాలు కోరింది. ఈ విషయంపై సెస్ ఏఈ రమేశ్‌ను సెల్‌ఫోనులో వివరణ కోరగా చెల్లించాల్సి బకాయిలో ప్రతి నెల కొన్ని డబ్బులు చెల్లించాలని సూచించిన స్పందించలేరని పేర్కొన్నారు. దాంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశామని వివరించారు.

రాజన్న ఆలయ దర్శనాల నిలిపివేత సరికాదు

వేములవాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని ముందస్తు సమాచారం లేకుండా మూసివేయడం సరికాదని సీపీఐ(ఎం) నాయకుడు ముక్తికాంత్ అశోక్ ఒక ప్రకటనలో పేర్కొనారు.